క్లుప్తంగా

నాగులాపల్లిలో నేడు వెంకన్న కల్యాణం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పాటి మీద వెంకన్న ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఊంజల సేవ, రాత్రి 7 గంటల నుంచి కోలాటం ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడుకు సత్కారం



మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రజా సేవలో ఉన్న సంతృప్తి మరెక్కడా దొరకదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మూలపేట గ్రామాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తున్న సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడును బుధవారం రాత్రి ప్రసాద్‌తో పాటు పలువురు పెద్దలు ఘనంగా సత్కరించారు. స్థానిక గంగాలమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో గంగప్పలనాయుడు జన్మదిన వేడుకలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తమ హయాంలో గ్రామాన్ని ఎంతమేర అభివృద్ధి చేశామన్నదే తీపి గుర్తుగా మిగిలిపోతుందన్నారు.

భరత నాట్యంపై శిక్షణ



నాట్య ప్రదర్శనతో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం గ్రంథాలయంలో చిన్నారులకు కూచిపూడి, భరతనాట్యంపై గురువు తులసి శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు డ్యాన్స్ తరగతులు ఏర్పాటు చేసినట్టు గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు నృత్య కళా ప్రదర్శనలో మంచి స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని డ్యాన్స్ మాస్టర్ తులసి ఆకాక్షించారు.

గ్రంథాలయ సందర్శన మంచి అలవాటు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో వివరిస్తున్న కరస్పాండెంట్ గోవిందు

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం, కథలు చెప్పడం చేశారు. రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ బత్తుల గోవిందు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలో సమయం వెచ్చించడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే కాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: యలమంచిలి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్వహణ, విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యలమంచిలి పట్టణం, మండలంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి (ఆపరేషన్స్) ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, మెయిన్ రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూ నగర్, ఎర్రవరం, కొత్త ఎర్రవరం, సోమన్నపాలెం, లైనుకొత్తూరు, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు, దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

బురదమయంగా ఇందిరమ్మ కాలనీ రోడ్డు

మునగపాకలో ఇందిరమ్మ కాలనీ రోడ్డు బురదమయంగా మారింది. ఏ మాత్రం వర్షం కురిసినా రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచిపోతోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కాంగ్రెస్ హయాంలో 516 మంది పేదలను గుర్తించి వారికి పట్టాలు మంజూరు చేశారు. పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. అయితే కాలనీకి వెళ్లే మెయిన్‌రోడ్డు దుస్థితిని చూసి పలువురు ఆవేదన చెందుతున్నారు.



మునగపాక ఇందిరమ్మ కాలనీ బురదమయంగా ప్రధాన రోడ్డు దుస్థితి

అధ్వానంగా యాదగిరిపాలెం రోడ్డు

ఏళ్ల తరబడి యాదగిరిపాలెం రోడ్డుకు మోక్షం లభించలేదు. దీంతో వర్షాకాలంలో సంబంధిత గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మొత్తం గోతులతో నిండిపోయింది. ఏ పాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో గోతులను తప్పించే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యాదగిరిపాలెంలో గోతులతో దర్శనమిస్తున్న రహదారి



బురదమయంగా మునగపాక జగనన్న కాలనీ ప్రధాన రహదారి

బురదమయంగా గ్రామీణ రహదారులు

చిన్నపాటి వర్షానికి గోతుల్లో నిలిచిపోతున్న వర్షపునీరు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మునగపాక: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గుంతలు లేని రహదారులు నిర్మిస్తామంటూ ఎన్నికల ముందుకు కూటమి పెద్దలు చేసిన హామీలు నీటి మూటలుగా మిగిలాయి. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా పలు గ్రామీణ రహదారులు బురదమయంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు జనం నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో పలు పల్లె రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.

దయనీయం.. జగనన్న కాలనీ రహదారి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి గ్రామాల్లో ఉచితంగా పట్టాలు మంజూరు చేయించారు. దీంతో పలు కాలనీలు వెలిశాయి. మౌలిక సదుపాయాలు కల్పించే క్రమంలో ప్రభుత్వం **మారిపోవడంతో ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. మునగపాక జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా దర్శనమిస్తోంది.** కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పడం లేదు. గ్రావెల్ రోడ్డు కావడంతో రహదారిపై వర్షపు నీరు నిలిచిపోతోంది.

బురదమయంగా రోడ్లు



పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మట్టి రోడ్లు కావడంతో వర్షాలు పడే సమయంలో బురదమయంగా మారుతున్నాయి. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఎక్కడా చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. గోతులు లేకుండా పక్కా రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది.

– గుంట్ల అప్పారావు, ద్విచక్ర వాహనదారుడు, మెలిపాక

జగనన్న కాలనీల్లో సదుపాయాలు కల్పించాలి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పలు కాలనీలు ఏర్పాటు చేశారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల్లో భాగంగా రహదారులు ఏర్పాటు చేసే క్రమంలో ప్రభుత్వం మారిపోయింది. నాటి నుంచి జగనన్న కాలనీల్లో ఎటువంటి అభివృద్ధి కానరాలేదు. మునగపాక జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. తక్షణం అభివృధికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పిల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా దళిత విభాగం అధ్యక్షుడు, మునగపాక

ప్రభుత్వానికి నివేదికలు

రహదారుల అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు అందించాం. మునగపాక ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ, మెలిపాక శివారు యాదగిరిపాలెం తదితర గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేసేందుకు రెండో విడతలో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే రహదారి అభివృద్ధి పనులు చేపడతాం.

– గులామ్, మునగపాక మండల ఇంజినీరింగ్ అధికారి

తిమ్మాపురం పంచాయతీ రికార్డుల పరిశీలన



పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మూర్తి

ఎస్.రాయవరం: తిమ్మాపురం పంచాయతీలో అవినీతి జరిగిందంటూ లోకాయుక్తాలో వేసిన ఫిర్యాదు మేరకు గురువారం పంచాయతీ రికార్డులు తనిఖీ చేసినట్టు డీఎల్‌పీవో మూర్తి తెలిపారు. నాలుగేళ్ల క్రితం ఎస్.రాయవరం మండలంలో పలు పంచాయతీలలో ఇంటి పన్ను వసూళ్ల నగదు, పంచాయతీ నిర్వహణ నిధులు పక్కదారిపట్టాయని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఇప్పుడు విచారణ చేస్తున్నట్టు మూర్తి చెప్పారు. రికార్డులు పరిశీలిన తరువాత నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.

ఎండీయు ఆపరేటర్ల తొలగింపు అన్యాయం

మాడుగుల రూరల్ : వాహనాలు ద్వారా ఇంటింటికి పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లను రోడ్డు మీద పడవేయడం దారుణమని, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, కె.జె.పురం వైఎస్సార్‌సీపీ నాయకులు, కె.జె.పురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకుడు మళ్ల కన్నబాబు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికి రేషన్ అందించాలనే ధ్యేయంతో వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేపట్టారని, నేడు కూటమి ప్రభుత్వం అనాలోచిత విధానాల వల్ల మరో 18 మాసాలు కాల వ్యవధి ఉన్నా సరే ఆపరేటర్లను తొలగించడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అనాలోచిత విధానాల వల్ల ఆపరేటర్లు రోడ్డున్న పడ్డారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

యోగా జీవితంలో భాగం కావాలి

యలమంచిలి రూరల్: యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో యోగా శిక్షకులు మళ్ల రాము, అడారి గంగాధర్ యోగాసనాలు అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

అచ్యుతాపురం రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 20 నుంచి జరుగుతున్న సమ్మెకు మద్దతుగా గురువారం అచ్యుతాపురం కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామంటూ పోరాటాల్లో పాల్గొని హామీ ఇచ్చి, అధికారం వచ్చాక స్టీల్ ప్లాంట్‌ని రక్షించకపోగా మరింత వేగంగా నిర్వీర్యం చేసే విధంగా ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేసే కార్మికులను కార్మిక చట్టాలను ఉల్లంఘించి 4వేల మందిని తొలగించి, మరో 2600 మంది కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూరంపూడి రమణ, రంగాల మాధవరావు, సనాసిరావు, శివకోటి, శివ, పూడి చందు, శీరా సంజీవరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అచ్యుతాపురం శ్రామిక సంఘాల నాయకులు

దళిత సంఘాల ధర్నా నేడు

నక్కపల్లి: మండలంలో డొంకాడ గ్రామంలో 8 మంది దళిత యువకులపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరచడంతో పాటు కులం పేరుతో దూషించిన టీడీపీ వారిని తక్షణమే అరెస్టు చేయాలంటూ శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నామని నాసా సంస్థ డైరెక్టర్, ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సోనివుడ్ తెలిపారు. నాసా సంస్థ ఆధ్వర్యంలో డీహెచ్‌పీఎస్, పలు దళిత సంఘాలు ఆధ్వర్యంలో ముందుగా నక్కపల్లి కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఘటన జరిగి నాలుగు రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లిలో జరిగే ఆందోళన, ర్యాలీకి అన్ని గ్రామాల నుంచి దళితులు తరలిరావాలన్నారు.



శుక్రవారం నిర్వహించే ఆందోళనపై బాధితులు, దళితులతో చర్చిస్తున్న సోనివుడ్

తెరుచుకోని ఎస్.రాయవరం గ్రంథాలయం

ఎస్.రాయవరం: వేసవి శిక్షణ శిబిరాలతో అన్ని గ్రంథాలయాలు కళకళలాడుతుంటే ఎస్.రాయవరం శాఖా గ్రంథాలయం వారం రోజులుగా తెరుచుకోకుండా బోసిబోయింది. ఇక్కడ సిబ్బంది బదిలీ కావడంతో దిమిని గ్రంథాలయ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యత లు అప్పగించారు. ఆమె ఎప్పుడు వస్తుందో? ఎప్పు డు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం రోజూ వచ్చే న్యూస్ పేపర్లను భద్రపరిచే నాథుడు కూడా కరువయ్యారు. పేపర్లు వర్షంలో తడుస్తూ ఆరుబయట ఉన్నాయి. కనీసం గేటు తెరచి శుభ్రం చేసే సిబ్బందిని కూడా కూటమి ప్రభుత్వ పెద్దలు నియమించలేదని విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయం నిర్వహణపై దృష్టి పెట్టాలని మండల వాసులు కోరుతున్నారు.



గ్రంథాయం ముందు తడిచిన న్యూస్ పేపర్లు

కళాకారులను ప్రోత్సహించాలి

మునగపాక: కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మండలంలోని మూలపేటలోని అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ దాతలు దుద్దుకుర్తి మోహనరావు-ప్రకాశరావు సోదరులు సొంత నిధులతో కొనుగోలు చేసిన చిడతలను కోలాటం కళాకారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన కళాకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.



కళాకారులకు చిడతలు అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



నక్కపల్లిలో అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మునగపాకలో అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ములకలాపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు



పెంటకోటలో హనుమాన్‌కు పూజలు చేస్తున్న చిక్కాల రామారావు



పాయకరావుపేటలో పూజలు చేస్తున్న దగ్గుపల్లి సాయిబాబా



యండపల్లిలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా నక్కపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మన్యుసూక్త సహిత అభిషేకం, సహస్రనామ సిందూర నాగవల్లి దళ పుష్పార్చన, అనంతరం హోమం నీరాజన మంత్ర పుష్పాలు జరిగాయి. నక్కపల్లి, సారిపల్లిపాలెం, బోదిగల్లం, అప్పల పాయకరావుపేట, మనబానవానిపాలెం, బండారుపేట, తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల సమక్షంలో ఆంజనేయ హోమం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి, సేవరాత్రి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీపాద ప్రణవ్‌రామ్, కోసూరు శ్రీను, వీసం రాజు, బంగార్రాజు, నవర నూకరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు. వేంపాడు, ఉద్దండపురం నెల్లిపూడిలలో ఉన్న హనుమాన్ ఆలయాల్లో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమలపాకు పూజలు, ఆంజనేయ హోమాలు జరిగాయి. సర్పంచ్ అయినంపూడి చినపేర్రాజు, సురేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అభయాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగులాపల్లి, మునగపాక తదితర గ్రామాల్లోని అభయాంజనేయ స్వామిని ఎమ్మెల్యే విజయకుమార్ దర్శించుకున్నారు. మునగపాక సంతబయిల ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం,రూరల్ ప్రాంతాల్లో గురువారం హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో సన్యాసమ్మ చెరువు పక్కన ఉన్న ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలు, తమలపాకులతో అలంకరించారు. ములకలాపల్లిలో అభయాంజనేయస్వామి ఆలయంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రత్యేక పూజలు చేశారు. యలమంచిలి పట్టణంలోని బస్టాండు పక్కనున్న వాయుపుత్రుని ఆలయంలో అర్చకుడు ఆచార్యులు స్వామికి ప్రత్యేకంగా నిర్వహించిన అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తులసీనగర్ శివార్లలో పంట పొలాల్లో కొలువుదీరిన రామబంటు విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలో పలుచోట్ల భక్తుల కోసం అన్నప్రసాద వితరణలు ఏర్పాటు చేశారు.

కోటవురట్ల: హనుమాన్ జయంతిని కోటవురట్ల, లింగాపురం, యండపల్లి, గొల్లపేట తదితర గ్రామాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

పాయకరావుపేట: మండలంలోని పెంటకోటలో ఉన్న హనుమాన్ ఆలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. పట్టణంలోని బృందావనంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పాయకరావుపేట ఉప సర్పంచ్‌లు జగతా భవానీ, శ్రీనివాస్.. హనుమాన్‌కు పూజలు నిర్వహించారు.

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం, దార్లపూడి, సైతారుపేట తదితర గ్రామాల్లో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.రాయవరంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ధర్మవరం అగ్రహారంలో ఏకాహం, హరిభజన నిర్వహించి భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం స్వామి ఊరేగింపు జరిపారు.



ధర్మవరం అగ్రహారంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఏకాహం



ఎస్.రాయవరంలో అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నక్కపల్లిలో ఆంజనేయస్వామి సన్నిధిలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్సాహంగా హనుమాన్ శోభాయాత్ర



రాజుపేట నుంచి ప్రారంభమైన శోభాయాత్ర

కోటవురట్ల: పల్లెల్లో జై హనుమాన్ నినాదం ప్రతిధ్వనించింది. హనుమాన్ జయంతి సందర్భంగా రాజుపేట గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర గురువారం ఉత్సాహంగా సాగింది. భారతీయ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధర్మ పరిషత్ అధ్యక్షుడు నక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో కాషాయ వస్త్రాలు ధరించిన భక్తులు బైక్ ర్యాలీ చేశారు. రాజుపేటలోని హనుమాన్ ఆలయం వద్ద మొదలైన శోభాయాత్ర జల్లూరు గ్రామంలోని కోనేరు వరకు సాగింది. అనంతరం దేశం కోసం సైన్యంలో పనిచేసిన విశ్రాంత సైనికులను ఘనంగా సత్కరించారు.